సాక్షి హనుమకొండ

శనివారం । 1 । జూలై । 2023

I



నకిలీ మావోయిస్టుల అరెస్ట్

మావోయిస్టుల పేరిట లెటర్‌ప్యాడ్ సృష్టించి డబ్బులు డిమాండ్ చేసిన నలుగురు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- IIలో ▸



కాజీపేటలో డీఆర్‌ఎం తనిఖీలు

ఈనెల 8న ప్రధాని మోదీ కాజీపేటకు రానున్న నేపథ్యంలో శుక్రవారం డీఆర్‌ఎం గుప్తా కాజీపేట జంక్షన్‌ను పరిశీలించారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం

34.0^0 / 26.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కమిషనరేట్‌లో వేలం

వరంగల్ క్రైం: పాత వాహనాలకు సంబంధించి మరమ్మతులు చేసిన వాహన విడిభాగాలు, టైర్లు, బ్యాటరీలను శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో వేలం వేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటారు విభాగం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు ఈ వేలంలో పాల్గొనాలని సీపీ రంగనాథ్ పేర్కొన్నారు.

నూతన పీఆర్సీ ఏర్పాటు చేయాలి

విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం నూతన పీఆర్సీ ఏర్పాటు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు, వి.రాంబాబు, ఎ.సదయ్య ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, బోయిని రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి మొదటి వేతన సవరణ కమిషన్ కాలపరిమితి ఈఏడాది జూన్ 30తో ముగిసినందున మరో నూతన పీఆర్సీని ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాలకు అనుగుణంగా ప్రతీ ఐదేళ్లకోసారి ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలన్నారు. తొలిమెట్టు అమలు పర్యవేక్షణకు స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు



వరంగల్ లీగల్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల పోర్ట్‌ఫోలియో జడ్జి కె.లక్ష్మణ్‌ను న్యాయవాదులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన వారిలో తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్కుర్తి ఆనంద్‌మోహన్, ఉపాధ్యక్షుడు, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్యామ్‌సుందర్‌రెడ్డి, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుల యాకస్వామి, బార్ కౌన్సిల్ మాజీ సభ్యులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, న్యాయవాది సంసాని సునీల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి అరవింద్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, సిటీ సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డులను సిటీ బయటకు తరలించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన అరవింద్‌కుమార్ వెంటనే హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాను చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చీఫ్‌విప్ వినయ్ తెలిపారు. సీఎం కేసీఆర్, పురపాలక నగరాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులు కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి హేమకళ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏఎన్‌ఎం పోస్టుకుగాను ఆన్‌లైన్‌లో ఈనెల 3 నుంచి 13వ తేదీలోపు tsobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 98497 36850 లేదా 98484 47036 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గన్.. కావాల్సిందే!

గ్రేటర్ వరంగల్‌లో కొత్తగా లైసెన్స్ కోసం దరఖాస్తులు, పైరవీలు

- పూర్తిగా తగ్గిన మావోయిస్టు కార్యకలాపాలు..
- ఇప్పటికే 314 నుంచి 192కి తగ్గిన లైసెన్స్‌లు
- వ్యక్తిగత భద్రత పేరిట మళ్లీ పెరుగుతున్న గన్‌కల్చర్
- అధికారులను సంప్రదిస్తున్న ఆశావహులు



సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్‌లో 'గన్' ఫ్యాషన్ మళ్లీ పెరుగుతోంది. తుపాకీ వెంటబెట్టుకోవడం కొందరు తప్పనిసరిగా భావిస్తున్నారు. వ్యక్తిగత భద్రత పేరిట గన్‌కల్చర్ వైపు ఆసక్తి చూపుతున్నారు. ఆయుధం... భద్రత కంటే హోదాగా మారిపోతుండగా, తోటివారిని చూసి ఏదో సాకుతో ఆయుధ లైసెన్స్ పొందాలన్న తపన పలువురిలో కనిపిస్తోంది. ఆత్మరక్షణ పేరుతో తుపాకీ కావాలనుకునే వారి సంఖ్య పెరుగుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తుపాకీ లైసెన్సుల కోసం మళ్లీ దరఖాస్తుదారులు పెరుగుతున్నారు. ఒకప్పుడు రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్ వ్యాపారులు అత్యధికంగా దరఖాస్తు చేసుకోగా.. ఇప్పుడు ఆ రంగాలతోపాటు ప్రజాప్రతినిధుల బంధువులు, యువకులు ఎక్కువగా ఆసక్తితో ఉన్నారు. తీవ్రవాద కలాపాలు పూర్తిగా తగ్గిపోయిన క్రమంలో ఏం సాకు చూపాలో అర్థం కాక రాజకీయ పలుకుబడిని ఉపయోగించే పనిలో ఉన్నారు. సుమారు ఏడాదిలో 42 మంది వరకు దరఖాస్తు చేసుకుంటే.. అధికార నేతల అభయం కోసం అనేక మంది వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

314 నుంచి 213కు తుపాకీ లైసెన్స్‌లు..

2014 అసెంబ్లీ ఎన్నికల నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 314 ఆయుధ లైసెన్స్‌లు ఉన్నాయి. వీటిలో బ్యాంకుల కోసం ఇచ్చినవి 74, ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినవి 240 ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తుల కోటాలో తీసుకున్న వారిలో రాజకీయ నేతలే ఎక్కువగా ఉన్నారు. 2015 జనవరి 25న వరంగల్ అర్బన్ పోలీస్ జిల్లా.. వరంగల్ కమిషనరేట్‌గా మారింది. 2016 అక్టోబర్ 11న జరిగిన జిల్లాల పునర్విభజన సమయంలో కమిషరేట్ పరిధి పెరిగింది. ఆ తర్వాత రియల్‌ఎస్టేట్, చిట్‌ఫండ్ వ్యాపారులు కూడా లైసెన్స్‌లు తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో తగ్గిన తీవ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో చాలా వరకు రద్దు చేశారు. కాగా కమిషనరేట్ పరిధిలో 192 లైసెన్సు తుపాకులు ఉండగా, ఉమ్మడి జిల్లాలో మరో 21 వరకు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.

తుపాకుల కోసం మళ్లీ ఆరాటం

జిల్లాల పునర్విభజన తర్వాత లెసెన్సు తుపాకులు కావాలనుకునే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 50కి పైగా దరఖాస్తులు పోలీసుశాఖ వద్దకు చేరాయి. ఇలా దరఖాస్తు చేసుకున్న వారిలో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు, కార్పొరేటర్లు, పోలీస్‌శాఖలో పైరవీలు చేసే వారు ఉన్నారని తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా తీవ్రవాద కార్యకలాపాల కేంద్రంగా ఉన్న సమయంలో రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, వ్యాపారవేత్తలకు మావోయిస్టుల నుంచి ముప్పు ఉండేది. దీంతో ఆత్మరక్షణ కోసం లైసెన్స్‌తో తుపాకీ కోసం దరఖాస్తు చేస్తే వాస్తవమైతే పరిస్థితులకు అనుకూలంగా పోలీసు అధికారులు లైసెన్సులు జారీ చేశారు. ఇప్పుడు గత పరిస్థితులు లేకపోవడంతో వాటి అవసరం లేదని భావించిన పోలీసుశాఖ చాలా వరకు లైసెన్సులు ఇవ్వడం తగ్గించింది. చాలాకాలంగా పైరవీలు, ఒత్తిళ్లు ఉన్నా.. లైసెన్స్‌లు ఇవ్వడం లేదు. ఈ సమయంలో మళ్లీ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేటర్లు, బిజినెస్ మెన్‌లు ఆయుధాల లైసెన్సుల కోసం కీలక నేతల చుట్టూ తిరుగుతుండడంపై మళ్లీ చర్చ జరుగుతోంది.

గ్రూప్–4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హన్మకొండ అర్బన్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లాలో శనివారం నిర్వహించే గ్రూప్–4 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గ్రూప్–4 పరీక్షల నిర్వహణకు మొత్తం 161 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 47,978 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే 32 రూట్లలో 32 మంది రూట్ ఆఫీసర్లు, పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేకాధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫొటో లేకుండా హాల్ టికెట్ వస్తే.. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో అటెస్ట్ చేయించుకొని పరీక్షకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కంటే 30 నిమిషాల ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవ్వాలి : సీపీ



మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలీసు అధికారులు సన్నద్ధం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ అధికారులకు సూచించారు. నెలవారీ నేర సమీక్షలో భాగంగా శుక్రవారం నగరంలోని నిట్ సమావేశ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. ఆదివారం జరిగే గ్రూప్–4 పరీక్ష బందోబస్తు ఏర్పాట్లపై క్రైం డీసీపీ మురళీధర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో బందోబస్తు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సాధారణ పోలీసు విధులపై అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. కీలక కేసుల్లో సాక్ష్యుల వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేయాలన్నారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, ఈస్ట్, వెస్ట్ జోన్ డీసీపీలు కరుణాకర్, సీతారాం, ట్రెనీ ఐపీఎస్ అంకిత్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో మాదిగల పోరాటం చరిత్రాత్మకం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- పరకాలలో చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పరకాల: ప్రత్యేక రాష్ట్ర పోరులో మాదిగ జాతి చేసిన పోరాటం చారిత్రాత్మకం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ.. మాటకు కట్టుబడి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 'చలో హైదరాబాద్' సన్నాహక సమావేశాన్ని శుక్రవారం పరకాలలోని మయూరి గార్డెన్‌లో నిర్వహించారు. మంద కృష్ణ మొదట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఊరేగింపుగా బయల్దేరగా.. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేసిన ఘనత ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు దక్కుతుందన్నారు. చివరి దశకు చేరుకున్న ఎస్సీ వర్గీకరణ పోరాటంలో మాదిగలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో నాయకులు గోవింద నరేశ్, బొర్ర భిక్షపతి, బుర్రి సతీశ్, జన్ను దినేశ్, గద్దల సుకుమార్, కట్ల రాజశేఖర్, మందకుమార్, వేల్పుల సూరన్న, బొచ్చు అనంత్, పాముల సుబ్బయ్య, గద్దల సుకుమార్, అంబలా చంద్రమౌళి, బొజ్జ హేమంత్, కోగిల ప్రేమ్‌కుమార్, నోముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



పీహెచ్‌సీ ఆవరణను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కమలాపూర్: మండలంలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల కమిటీ (ఎన్‌క్వాస్) కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలో ఔట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, ల్యాబోరేటరీ సర్వీసెస్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ప్రసవాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ, అంధత్వ నివారణ కార్యక్రమం, టీకాలు, హెచ్ఐవీ, టీబీ, ఫైలేరియా, కుష్ఠు, మలేరియా తదితర విభాగాల్లో పనితీరు, పురోగతిని, ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలు, రోగులకు అందించే వైద్య సేవలు, ఆస్పత్రి ఆవరణ, పరిసరాల పరిశుభ్రత, ఆస్పత్రి రికార్డుల నిర్వహణ తదితరాలన్నింటినీ కేంద్ర బృందం పరిశీలింలించింది. శనివారం కూడా కేంద్ర బృందం సభ్యులు మరోసారి ఉప్పల్ పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకోనున్నారు. కార్యక్రమంలో ఎన్‌క్వాస్ కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ శ్రీరామ్ సీజే, డాక్టర్ ప్రశాంత్ పుండలిక్ గోదం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గీతాలక్ష్మి, డీఎస్‌ఓ డాక్టర్ వాణిశ్రీ, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి డాక్టర్ పరంజ్యోతి, పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మశ్రీ, ఆర్‌బీఎస్‌కే, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి బలాకా, విజయ క్రమాల్లో పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి బలాకా, విజయ క్రమాల్లో పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను దేవాలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకులు శేషు పూర్ణకుంభంతో స్వాగతించారు. పూజల అనంతరం అర్చకులు మహదాశీర్వచనం అందించారు. కమిషనర్‌తో పాటు వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత అమ్మవారిని దర్శించుకున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



దామెర చెరువు ట్యాంక్ బండ్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: పరకాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే.. ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారికి ప్రజలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాలలో రూ.3.6 కోట్ల నిధులతో జరుగుతున్న దామెర చెరువు ట్యాంక్ బండ్ పనుల్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ట్యాంక్ బండ్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రూ.8.50 కోట్లతో పరకాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ట్యాంక్ బండ్ నిర్మాణంతో పాటు చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే స్పీడ్ బోటింగ్ కూడా ఏర్పాటు చేసేందుకు చెరువులోని చెట్లను తొలగించాలని అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ చొరవతో నియోజకవర్గంలోని గ్రామాలకు, మండలాలకు అనుసంధానంగా ఉండే రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభం చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. రహదారులు పూర్తయితే ప్రజలకు, రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇంత అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి సారంగపాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వివరిస్తూ.. ఆదరించాలని కోరుతూ..



లబ్ధిదారులకు పోడు భూమి పట్టా అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

మానుకోటలో సాగిన మంత్రి కేటీఆర్ పర్యటన

- పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కూరగాయల వ్యాపారులు, డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో మాటామంతి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతూ..

సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) పర్యటన సాగింది. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పోడు రైతులకు పట్టాలు అందజేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ.. మరోసారి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉదయం మానుకోటకు చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు.

పైలాన్ ఆవిష్కరణ..

ఉదయం 11.55 గంటలకు మానుకోటకు చేరుకున్న కేటీఆర్.. ముందుగా సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.50కోట్లతో చేపట్టే పనుల వివరాలతో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. తహసీల్ ఎదుట ఈ పైలాన్ ఆవిష్కరణ సందర్భంగా జనాలు ఒక్కసారిగా ముందుకు రావడం, తోపులాట జరగడంతో వీఐపీలు ఇబ్బందులు పడ్డారు. 12.04 గంటలకు రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరగాయలు అమ్ముతున్న ద్వాలీ, అత్తకూరు రమాదేవితో మంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును చర్చించారు. అక్కడే సెర్ప్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పట్టాల పంపిణీ..

డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి 12.43 గంటలకు నేరుగా మంత్రి.. ఎన్టీఆర్ స్టేడియం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. 1.27 గంటలకు సభా వేదికకు చేరుకొని పోడు రైతులకు పట్టాలు అందజేశారు. మధ్యాహ్నం 1.51 గంటల వరకు అంటే 24 నిమిషాలపాటు ప్రసంగించారు.

వీటిని ప్రారంభించకుండానే..

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వివేకానంద సెంటర్ నుంచి రూ.5కోట్లతో నిర్మాణం చేయనున్న రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనుల శంకుస్థాపన కోసం శిలాఫలకంతో పాటు ఇతరత్రా ఏర్పాట్లు చేయగా.. దానికి శంకుస్థాపన చేయలేదు. సభలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేసముద్రాన్ని మున్సిపాలిటీ చేయాలని, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించకపోగా మానుకోటకు ఎలాంటి వరాలు కురిపించకపోవడంతో ప్రజలు నిరాశ చెందారు. తన ప్రసంగంలోనూ వరాల విషయంలో దాట వేసే ధోరణితో మాట్లాడినట్లు స్థానికులు చెబుతున్నారు.

డబుల్ ఇళ్ల ప్రారంభం..



మధ్యాహ్నం 12.28నుంచి 12.36 వరకు : మానుకోట పట్టణంలోని రాంచంద్రాపురం కాలనీలో నిర్మించిన 200 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి, గృహప్రవేశాలు చేయించారు. ఇంటి యజమాని పిల్లి విజయ మంత్రులను ఇంట్లోకి ఆహ్వానించారు. ఇంట్లో మంచానికి పరిమితమైన విజయ భర్త శ్రీను ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. వారికి ఇంటి పట్టా అందజేశారు. పక్కనే రమ ఇంటికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశం చేయించారు. కేసీఆర్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు

ఆస్పత్రి రూపురేఖలు మారాయి: కేటీఆర్

మానుకోట జిల్లా ఆస్పత్రి రూపురేఖలు మారాయని.. రాష్ట్రంలో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న రోజుల నుంచి.. సర్కారు దవాఖానాకే వెళ్తాను అనే రోజులు వచ్చాయి' అని మంత్రి కేటీఆర్ అన్నారు. పది మంది డాక్టర్లు లేని ఆస్పత్రిలో 140 మంది డాక్టర్లు పని చేస్తూ వైద్య సేవలు అందించడం ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. తెలంగాణ వస్తే ఏం వస్తుందని అడిగిన వాళ్లకు ఇదే మా సమాధానం అన్నారు. మధ్యమధ్యలో పిట్టకథలు, జై తెలంగాణ నినాదాలు, కేసీఆర్ చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలు చెబుతూ ప్రజలను ఉత్తేజపర్చారు. బీజేపీ చేసిన మోసం, కాంగ్రెస్ నాయకుల మాటలు చెబుతూ.. ప్రజల్లోకి వస్తున్న పరిస్థితిని వివరించారు. వారిని నమ్మవద్దని, వారికి మద్దతిస్తే ఆగమవుతారన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేయాలని, ప్రభుత్వాన్ని నిలబెట్టాలని చెప్పకనే చెప్పారు. చివరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నినాదాలు, సభకు వచ్చిన వారితోపాటు, అతిథులకు భోజనాల ఏర్పాటులో తోపులాటలు జరగడం కొసమెరుపు. అదేవిధంగా డిగ్రీ కళాశాల నుంచి బయటకు వెళ్తున్న కేటీఆర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యానాయక్, హరిప్రియ, అరూరి రమేశ్, నరేందర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కలెక్టర్ శశాంక, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, జెడ్పీ చైర్‌పర్సన్లు గంగ్రజ్యోతి, ఆంగోతు బిందు, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, భీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

గరంగరంగా.. కేటీఆర్

- ఆద్యంతం కోపంగానే కనిపించిన మంత్రి
- ముఖంపై కనిపించని చిరునవ్వు.. సభావేదికపైన ముభావంగానే..
- కేటీఆర్ తీరుపై రకరకాలుగా చర్చ

- వివరాలు IIలో ▸

గరంగరంగా.. కేటీఆర్

- ఆద్యంతం కోపంగా కనిపించిన మంత్రి
- ముఖంపై కనిపించని చిరునవ్వు.. సభావేదికపైన ముభావంగానే
- కేటీఆర్ తీరుపై రకరకాల చర్చ


ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేయిని విసురుగా తీసివేస్తున్న మంత్రి కేటీఆర్


వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ ఇస్తున్న పూలబొకేను తిరస్కరిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, మహబూబాబాద్: మానుకోట పర్యటనలో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ వ్యవహార శైలి సహజత్వానికి భిన్నంగా కనిపించింది. మంత్రి ఏ జిల్లాకు వెళ్లినా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ నవ్వుకుంటూ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కానీ శుక్రవారం మహబూబాబాద్‌లో మాత్రం కొంత గరంగరంగా ఉన్నట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. దీనిపై కూడా సోషల్ మీడియాలో విస్తృత చర్చ నడిచింది. హైదరాబాద్ నుంచి బయల్దేరిన మంత్రి జనగామ, తొర్రూర్ మీదుగా మహబూబాబాద్‌కు చేరుకుంటారని భావించారు. అలా కాకుండా నకిరేకల్.. అర్వపల్లి..తానంచెర్ల మీదుగా మహబూబాబాద్ వచ్చారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మానుకోట ఎంపీ కవిత మరిపెడలో మంత్రిని ఆపి టీ బ్రేక్‌కు ఆహ్వానించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దానిని సున్నితంగా తిరస్కరించిన కేటీఆర్ అక్కడి నుంచి మహబూబాబాద్ వైపు వచ్చారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మహబూబాబాద్ సరిహద్దు సలార్ తండా వద్ద స్వాగతం పలికి తమ క్యాంపు ఆఫీస్‌కు తీసుకెళ్లాలని కోరినట్లు తెలిసింది. ఇక్కడ కూడా తిరస్కరించిన కేటీఆర్ నేరుగా మంత్రి సత్యవతి రాథోడ్ ఇంటికి వెళ్లి అందరిని ఆశ్చర్యపరిచారు. తన ఇంటికి కేటీఆర్ వస్తున్న విషయం మంత్రికి కూడా తెలియకపోవడంతో హుటాహుటిన ఆమె వెళ్లి మంత్రిని ఇంట్లోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే చేయి పట్టుకోబోగా..

తహసీల్దార్ కార్యాలయం వద్ద పైలాన్ ఆవిష్కరణలో జరిగిన తోపులాట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టింది. అక్కడినుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్దకు వెళ్లిన సందర్భంలో పూలతో స్వాగతం పలికే దారి కాకుండా కేటీఆర్ వేరే దారిన వెళ్తుండగా అటుగా వెళ్దామని ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేయి పట్టుకోగా.. కేటీఆర్ ఒకింత విసురుగా శంకర్ నాయక్ చేయిని తీసివేశాడు. ఈ వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదేవిధంగా సభా వేదిక వద్ద వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పుష్పగుచ్ఛం ఇస్తుంటే తిరస్కరించిన తీరును బట్టి మంత్రి ఆగ్రహంగా ఉన్న విషయం కొట్టొచ్చినట్టు కనిపించింది. సభావేదికపై కూడా ఎలాంటి చిరునవ్వు చిందించకుండా ముభావంగా కనిపించారు. ఇటీవల జరిగిన ప్రతి సభల్లో స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలను చూపిస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని చెబుతూ వచ్చారు. కానీ మహబూబాబాద్‌లో మాత్రం నాయకులను పరిచయం చేయడం కానీ, వారికి ఓటేసి గెలిపించాలనే ప్రస్తావన కూడా తేలేదు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జర్నలిస్టులు నినాదాలు చేయగా.. పెద్దగా పట్టించుకోకుండా వారివైపు ఆగ్రహంగా చూస్తూ వెళ్లిపోయారు. ఇన్ని సంఘటనల నేపథ్యంలో కేటీఆర్ ఆగ్రహంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ఎందుకిలా వ్యవహరించారు..?

సహజంగా ఉండే కేటీఆర్ ఈ శుక్రవారం ఎందుకు ఇలా వ్యవహరించారనే దానిపై రకరకాల చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన సర్వేలో మానుకోటలో జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి సానుకూల వాతావరణం లేదనే విషయం ప్రచారమవుతున్న నేపథ్యంలో జిల్లాలో మంత్రి పర్యటనలో చోటు చేసుకున్న సంఘటనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో యువరాజుగా ఉంటూ రేపు జరిగే ఎన్నికల టికెట్ల కేటాయింపులో కీలకభూమిక పోషించే కేటీఆర్ కోపానికి కారణం ఏమైఉంటుందోనని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

5 లక్షల మందితో ప్రధాని బహిరంగ సభ


కాజీపేట: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి


వరంగల్ చౌరస్తా: గ్రౌండ్ పరిశీలిస్తున్న నాయకులు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హన్మకొండ: 5లక్షల మందితో ఓరుగల్లులో నిర్వహించే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రేమేందర్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ నగర అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసిందన్నారు. వరంగల్ నగర అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ, అమృత్. హృదయ్ వంటి పథకాలు అమలు చేసిందని చెప్పారు. ఈ క్రమంలో కాజీపేటలో వ్యాగన్ తయారీ పరిశ్రమ, వ్యాగన్ పీరియాడికల్ ఓవరాయిలింగ్ యూనిట్‌కు జూలై 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ప్రధాన మోదీ రాక సందర్భంగా వరంగల్ మహానగరంలో 5లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ నిర్వహణకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం, వరంగల్‌లోని ఓ సిటీ మైదానాన్ని పరిశీలించి ప్రతిపాదనలు ఢిల్లీకి పంపినట్లు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, నాయకులు మార్తినేని ధర్మారావు, చందుపట్ల కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వన్నాల శ్రీరాములు, ఎడ్ల అశోక్ రెడ్డి, కోరబోయిన సాంబయ్య, దేశిని సదానందం, జయంత్‌లాల్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు స్థల పరిశీలన

వరంగల్ చౌరస్తా: ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా ఈనెల 8న వరంగల్ ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాజీపేట రైల్వే కోస్ట్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్క్ శంకుస్థాపన అనంతరం భారీ బహిరంగ సభలో పాల్గొంటారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అజంజాహి మిల్స్ గ్రౌండ్‌ను గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, నాయకులు పరిశీలించారు.

హత్య కేసులో పలువురి రిమాండ్

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో పలువురిని రిమాండ్‌కు తరలించినట్లు నర్మెట సీఐ నాగబాబు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణయ్యను హత్య చేయించిన గిరబోయిన అంజయ్యను రెండు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నామని తెలిపారు. అంజయ్యను విచారించగా వారికి భూమి విషయంలో మృతుడు రామకృష్ణయ్య తరచూ ఇబ్బందులకు గురి చేయడంతో సుపారీ ఇచ్చి హత్య చేయించారని వెల్లడైనట్లు చెప్పారు. ఈయనతోపాటు ఈ హత్యకు సహకరించిన మండలంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పస్తం జలేందర్, పస్తం పెద్ద ఉప్పలయ్య, పోచన్నపేట సర్పంచ్ గట్టు మంజుల భర్త గట్టు మల్లేశంలను జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డిలు రిమాండ్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేశామని ఈ కేసుపై పూర్తి నిర్ణయాలను వరంగల్ సీపీ రంగనాథ్ తీసుకున్నారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టుకు తరలింపు

రెండు రోజుల క్రితం హంతకుడు గిరబోయిన అంజయ్య, సుపారీ గ్యాంగ్ భాస్కర్, శ్రీకాంత్‌లను డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డిలు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వారికి వైద్య పరీక్షలను నిర్వహించి వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో అప్పగించి, తిరిగి జనగామ కోర్టుకు తీసుకొచ్చారు.

కాజీపేటలో రైల్వే డివిజనల్ మేనేజర్ తనిఖీలు

- ప్రధాని భూమి పూజ చేసే వ్యాగన్‌షెడ్ పనులు, హెలిపాడ్ కోసం స్థల పరిశీలన


రైల్వే వ్యాగన్ షెడ్ నమూనాను పరిశీలిస్తున్న డీఆర్ఎం గుప్తా, అధికారులు

కాజీపేట రూరల్: జూలై 8న ప్రధాని మోదీ జిల్లాకు రానున్న నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) ఎకే.గుప్తాతోపాటు వివిధ విభాగాల రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ పరిధిలో శుక్రవారం పరిశీలించారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు.. ముందుగా డీఆర్ఎం గుప్తా అయోధ్యపురంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (పీఓహెచ్) స్థలం వద్దకు చేరుకొని షెడ్ ప్రహరీ పనులు, ప్రధాని మోదీ శంకుస్థాపన భూమి పూజ చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. వ్యాగన్ షెడ్ నమూనా, మ్యాప్‌ను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో సమావేశమై ప్రధాని పర్యటన వివరాలు, ఏర్పాట్లపై తెలుసుకున్నట్లు సమాచారం. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్, ఫాతిమానగర్‌లోని సేయింట్ గాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో హెలిపాడ్‌ను డీఆర్ఎం పరిశీలించినట్లు తెలిపారు. కాగా, కాజీపేట అయోధ్యపురంలో రూ.386 కోట్ల వ్యయంతో నిర్మించే ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాప్‌నకు భూమి పూజతోపాటు రూ.100 కోట్లతో వ్యాగన్ తయారీ పరిశ్రమ యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

బడికెళ్తే బతికెటోడు..

- బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


బిట్టు(ఫైల్)

చిట్యాల: బడికి వెళ్లకుండా ఇంటివద్ద ఉండి స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చేరాల రాజబాబు-అనిత (రమ్య) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బిట్టు(14) మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, శుక్రవారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి వెంకట్రావుపల్లి(సి) గ్రామ శివారులోని బావిలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బావిలోనే గల్లంతయ్యాడు. దీంతో అతని స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించగా.. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బావి వద్దకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న సీఐ వేణుచందర్, మొగుళ్లపల్లి, టేకుమట్ల ఎస్సైలు శ్రీధర్, చల్లా రాజు, చిట్యాల ఏఎస్సై మధుసూదన్, పోలీస్ సిబ్బంది లింగన్న సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బావిలో నీరు ఎక్కువ ఉండడంతో గ్రామస్తుల సాయంతో నాలుగు మోటార్లతో అర్ధరాత్రి వరకు నీటిని బయటకు పంపించారు. దీంతో విద్యార్థి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

పదవీ విరమణ సహజం

వరంగల్ అర్బన్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన 11 మంది సిబ్బంది పదవీ విరమణ కార్యక్రమంలో మేయర్ సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు పాల్గొని సిబ్బందిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది ఎ.గట్టయ్య, ఆర్.చంద్రమౌళి, గడిపి రాజయ్య, కమల, కష్టారావు, మేడి సంపత్, సరోజ, మల్లికాంబ, ఇబ్రాయిల్, రేణుకాదేవి, సీహెచ్.లక్ష్మయ్య తదితరుల సేవలను కొనియాడారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాలపురం మాధవనగర్ కాలనీకి చెందిన తల్లీకూతుళ్లు అదృశ్యమయ్యారు. ఈమేరకు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. మాధవనగర్ కాలనీకి చెందిన బిల్లా దామోదర్‌రెడ్డి వృత్తి రీత్యా వ్యాపారం. అతడికి భార్య కరుణ, కుమార్తె సహస్ర, కుమారుడు సాయిసిద్ధార్థ ఉన్నారు. శుక్రవారం సాయంత్రం సిద్ధార్థను ఇంటిని తీసుకురావడానికి స్కూల్‌కు దామోదర్ వెళ్లారు. తిరిగి వచ్చేసరికి భార్య కరుణ, కుమార్తె సహస్ర కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


హరీశ్ మృతదేహం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లి శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ ప్రాంతానికి చెందిన సూత్రపు హరీశ్ (26) కాజీపేటలోని తన స్నేహితుడి ఇంటికి వచ్చి తిరిగి వరంగల్‌కు వెళ్తుండగా భట్టుపల్లి శివారు పెట్రోల్‌పంపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ పోలీసులు వెల్లడించారు.

నకిలీ మావోయిస్టుల అరెస్ట్

- మావోయిస్టు లెటర్‌ప్యాడ్‌తో డబ్బులు డిమాండ్
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం: మావోయిస్టుల పేరిట లెటర్‌ప్యాడ్ సృష్టించి పలిమెల మండలం పంకెన సర్పంచ్ బొచ్చు శ్రీనివాస్, రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్‌కు లెటర్ పోస్టు చేసి డబ్బులు డిమాండ్ చేసిన నలుగురు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాటారం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన ఎర్ని సోమయ్య హైదరాబాద్‌లో పని చేస్తున్నప్పుడు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎలుకలపల్లికి చెందిన చిలుముల తిరుపతి పరిచమయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇద్దరు కలిసి మావోయిస్టుల పేరిట డబ్బున్న వ్యక్తులను బెదిరించి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో మావో యిస్టు లెటర్ ప్యాడ్‌ల ద్వారా డబ్బులు డిమాండ్ చేయాలని వాటి నమూనాను యూ ట్యూబ్‌లో పరిశీలించారు. కరపత్రాలను తయారు చేయడానికి మరో ఇద్దరు అవసరం పడగా తిరుపతి బామ్మర్ది గోదావరిఖనికి చెందిన ఈర్ల రాంచందర్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు టేకుల సుధీర్‌కు వీరి ప్లాన్ వివరించారు. మావోయిస్టు రెడ్ లెటర్స్‌తో లెటర్‌ప్యాడ్ తయారు చేసి జూన్ 15న హైదరాబాద్‌లోని ఓ పోస్ట్ ఆఫీస్ నుంచి పంకెన సర్పంచ్ బొచ్చు శ్రీనివాస్, రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్‌కు నిందితులు పోస్ట్ చేశారు. రెండు రోజుల తర్వాత నిందితులు ఓ ఫోన్ ద్వారా సర్పంచ్‌కి ఫోన్ చేసి రూ.ఐదు లక్షలు కరీంనగర్ బస్టాండ్ నందు ముట్టజెప్పాలని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన సర్పంచ్ జూన్ 29న పలిమెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకుందామని ఎర్ని సోమయ్య గ్రామానికి రాగా సమాచారం అందుకున్న పలిమెల పోలీసులు గ్రామానికి చేరుకొని సోమయ్యని అదుపులోకి తీసుకొని విచారించారు. సోమయ్య తెలిపిన సమాచారంతో మిగితా నిందితులైన తిరుపతిని హైదరాబాద్‌లో రాంచందర్, సుధీర్‌ను గోదావరిఖనిలో పలిమెల పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు అండ్రాయిడ్ మొబైల్‌ఫోన్లు, మూడు మావోయిస్టు లెటర్‌ప్యాడ్లు, కలర్ ప్రింటర్ స్వాధీనపర్చుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కాళేశ్వరం, పలిమెల ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్, శివ, కానిస్టేబుళ్లు బాల్‌సింగ్, శ్యాం, మధు, సమ్మయ్య, అరుణ్, సంతోష్‌లను ఎస్పీ సురేందర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

ప్రాణం తీసిన మిస్డ్‌కాల్ పరిచయం!

- చనువు పెరిగి.. ప్రేమగా మారింది..
- చివరికి నా దగ్గరికి రా..లేదా చంపేస్తా..! నచ్చిపో అంటూ వేధింపులు .
- పరువు పోతుందని కుళాయి గుంతలో దూకిన వివాహిత
- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి
- వరంగల్‌లో ఘటన


సౌజన్య (ఫైల్)

ఖిలా వరంగల్: ఆమెకు పెళ్లయ్యింది. ఒక పాప. అపరిచిత వ్యక్తి చేసిన మిస్డ్ కాల్.. ఆ ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు సన్నిహితంగా మెలిగారు. చివరికి అతను నా దగ్గరకు వస్తావా..రావా..? లేదా చంపేస్తా..? అంటూ వేధింపులకు దిగాడు. ఇరువురి నడమ జరిగిన విషయాలు ఎవరికి ఆమె చెప్పుకోలేక.. పరువు పోతుందనే భయందోళనకు గురై కుళాయి గుంతలో(సంపు) దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఘటన వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామానికి చెందిన ఆకుతోట హోలియా, జనార్దన్ దంపతుల కుమార్తె సౌజన్య (34)ను 13 ఏళ్ల క్రితం వరంగల్ ఉర్సు కరీమాబాద్ వాటర్ ట్యాంక్ రోడ్డుకు చెందిన ఆకుతోట రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి 11 ఏళ్ల కుమార్తె రక్షిత ఉంది. రాజు టాటా ఏస్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, సౌజన్య తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంది. కొంతకాలం క్రితం సౌజన్య సెల్‌ఫోన్‌కు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి చెందిన దూలం తిరుపతి అనే వ్యక్తినుంచి మిస్డ్‌కాల్ వచ్చింది. ఎవరైనా కాలేజీ పని కోసం ఫోన్ చేసినట్లు భావించిన ఆమె.. తిరిగి ఫోన్ చేసింది. ఇలా.. ఫోన్‌లో ఇరువురి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆ తరువాత తిరుపతి ఫోన్ చేసి 'నా దగ్గరికి రా.. లేదా చచ్చిపో... మన మధ్య ఏర్పడిన ప్రేమ ఎవరికైనా చెబితే చంపేస్తా' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన సౌజన్య తన తల్లి హోలియాకు జరిగిన విషయం చెప్పగా వెంటనే ఆమె ఉర్సు కరీమాబాద్‌లోని కుమార్తె ఇంటికి చేరుకుంది. గురువారం బీరన్న బోనాలు కావడంతో బిడ్డ, అల్లుడితో ఎదురవుతున్న విషయాన్ని చర్చించలేదు. ఈ ప్రేమ వ్యవహారంతో పరువు పోతుందని, కట్టుకున్న వాడికి మోసం చేయలేక.. ప్రేమికుడి బెదిరింపు కాల్స్‌తో భయంతో కుళాయి గుంత (సంపు)లోకి దూకింది. తెల్లవారుజామున ఇంట్లో బిడ్డ లేకపోవడంతో అనుమానం వచ్చి సంపులోకి తొంగి చూడగా నీటిలో కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కూతురు సౌజన్య మృతికి కారణమైన దూలం తిరుపతిపై తల్లి హోలియా మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముందే నిర్ణయించుకుందా..?

సౌజన్య ఆత్మహత్య చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఉర్సు కరీమాబాద్‌లో గురువారం బీరన్న బోనాలు జరిగాయి. అంతా బోనాల సందడి నెలకొంది. సౌజన్య ఇంటికి తల్లి హోలియాను పిలిపించుకుంది. రాత్రి భోజనాల సమయంలో తన కుమార్తె రక్షితను తల్లి హోలియా, భర్త రాజు చేతిలో పెట్టి బాగా చదివించాలి.. నీవు మరింత కష్టపడాలి అని చెప్పింది. ఆమె ఇలా ఎందుకు చెబుతుందో వారికి అర్థం కాలేదు. బిడ్డ రక్షితను అక్కున చేర్చుకుని బాగా చదువుకోవాలని చెప్పినట్లు హోలియా తెలిపింది. చనిపోవాలని ముందే అనుకుని ఇలా చేసిందని రోదిస్తూ చెప్పింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఇల్లు అమ్మబడును

- WGL, కాశిబుగ్గ, సాయిగణేష్ కాలనీ రోడ్ నెం.4, తూర్పు 30 ఫీట్ల రోడ్డు గల 208 గజాల స్థలంలో 4000/- కిరాయి వస్తున్న ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 8919432992. [W-785663]

TO-LET

- WGL- JPN Road, Opp: సత్య హాస్పిటల్, East Face షట్టర్ Stores / Doctor క్లినిక్ / ఆఫీసులకు కిరాయికి ఇవ్వబడును with టైల్స్ / 3 ఫేజ్ కరెంట్/ ఫాల్స్ సీలింగ్ with Wiring. Cell: 9885000450. [WA-529]

LAND FOR SALE

- ధర్మసాగర్ మండలం, బంజరుపల్లి గ్రామ శివారులో 4 1/2 ఎకరాల వ్యవసాయ భూమి పట్టా పాస్‌బుక్ మరియు రైతుబంధు వస్తుంది, అమ్మకానికి కలదు. సెల్: 9849359714. [W-785622]

FLAT FOR SALE

- KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్, అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091. [WA-27124]

HOUSE FOR SALE

- ములుగురోడ్డు, కాకతీయ కెనాల్, కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27121]
- వరంగల్ రంగశాయిపేట శేషాద్రి హిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy. 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666 / 8309035091 [WA-27118]
- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091 [WA-27115]
- S / East 40 Feet Road Corner 390 Sq.Yrds Plot with 1560 Sft G+1 Building at Mamnoor KUDA Layouts Location. 9032111600. [W-785621]

SERVICES

CAFE FOR SALE

- Own your Dream Cafe for Sale in Prime Location, Fully equipped, loyal Customer base, Seize the Opportunity Today. Cont: 7065002820. [W-785667]

WATER PROOFING

- ఉదయశ్రీ వాటర్ ప్రూఫింగ్: స్లాబ్‌లు, బాత్రూములు, గోడలు, వాటర్ ట్యాంక్, రూఫ్, బిల్డింగ్ లీకేజీలను బ్రాండెడ్ కెమికల్స్‌తో 10 సం॥ గ్యారంటీతో చేయబడును. ఫోన్: 9440052758. [H-780888]

WANTED

- ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! నిరుద్యోగులకు ఉపాధి (పెట్టుబడి లేదు) స్వచ్ఛంద సేవా సంస్థ నందు క్రౌడ్ ఫండింగ్ చేయుటకు జిల్లా కో-ఆర్డినేటర్ స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ 10K. సెల్: 8143909459. [M-1221327]
- ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000/- ఫోన్: 70756 56208. [V-6172]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

* మనం మాట్లాడుకోవాల్సిందే!

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టెస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించే వారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది" అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.


సాబ్రి

న్యూస్‌మేకర్

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్టాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

ది బాస్ లేడీ


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.


బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవీ సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మొటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.



కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్ షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.